క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష



బ్రాహ్మణపల్లిలో రెవెన్యూ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పలు గ్రామాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలపై బ్రాహ్మణపల్లిలోని తన స్వగృహంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం సమీక్షించారు. ప్రధానంగా సాదాబైనామాలు, చుక్కల భూముల సమస్యలపై సత్వరం స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, మర్రిపాడు తహసీల్దారు ఆనంద్ రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లి తిరునాళ్ల ప్రారంభం

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం బొమ్మవరంలో భక్తుల కొంగు బంగారం ముత్యాలమ్మతల్లి తిరునాళ్ల శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. శనివారం భజన, ఆదివారం పాల పొంగళ్ల నైవేద్యాలు సమర్పించనున్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమపూజ నిర్వహిస్తున్న మహిళలు

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియలో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చన జరిగింది. వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా మహిళలతో కుంకుమ పూజ చేయించారు. తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు: మండలంలోని పాడి రైతులు, జీవాల కాపరులు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్ర శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీమా పథకం ద్వారా గేదెలు, ఆవులు, పందులు, గొర్రెలు, మేకలకు బీమా చేసుకునే సౌకర్యం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారులు 50 శాతం వాటాగా చెల్లిస్తే మిగిలిన వాటా నగదు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ పథకం గరిష్ఠంగా ఒక కుటుంబానికి ఐదు గేదెలు, ఆవులు లేక 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు



శ్మశాన వాటికలో బోరు వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని బూదవాడ పంచాయతీ మజరా కృష్ణాపురం బీసీకాలనీ శ్మశాన వాటికలో శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భేరి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బోరు వేయించారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో సొంత నిధులు వెచ్చించి ఈ కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. హిందూ, ముస్లింలు కలిసి శ్మశానంగా వినియోగించే ప్రదేశంలో బోరు లేక పడుతున్న ఇబ్బందులు పరిష్కారం కావడంతో బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఓంకారం శివసాయికుమార్ రాజు, చింతగుంట రామకృష్ణారెడ్డి, అబ్దుల్లా, పాల్గొన్నారు.

లస్కర్‌పై పోలీసులకు డీఈ ఫిర్యాదు

ఉదయగిరి: గండిపాళెం జలాశయంలో లస్కర్‌గా పనిచేసే బాషా తనపై దౌర్జన్యం చేసి దుర్భాషలాడాడని ఉదయగిరి సబ్ డివిజన్ డీఈ వై.శంకరనారాయణ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సీఐ గిరిబాబును కోరారు.

సొంతింటి కల నిజం చేయడమే సీఎం లక్ష్యం

- కామిరెడ్డిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

చేజర్ల (సోమశిల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేసే సదుద్దేశంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు మంజూరు చేస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు సచివాలయ పరిధిలోని కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేసి ప్రతి పథకం వచ్చింది కదా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఈ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి చేరుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. శ్మశాన వాటికకు దారి సమస్య ఉందని పరిష్కరించాలని కోరడంతో వెంటనే ఆ సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొంత మంది రెవెన్యూ సమస్యలు, భూ సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కామిరెడ్డిపాడు సచివాలయ పరిధిలో రూ.16 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధి పనులు అందజేశారని వివరించారు. నూతనంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఇళ్ల పట్టాలను అందజేశారు. త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, కామిరెడ్డిపాడు సర్పంచ్ బి భారతమ్మ, ఎంపీటీసీ కాలువ నర్సింహులు, అనంతసాగరం సర్పంచ్ శోభ, ఎంపీడీఓ మధుసూదన రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్, ఏఈలు సుదర్శన్, మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపిరెడ్డి పద్మజారెడ్డి, మంగుపల్లి వైస్ ప్రెసిడెంట్ కార్తీక్, నాయకులు పెంచలయ్య, చంద్ర, ప్రసాద్ కేతా సుబ్బారెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజలకు నాణ్యమైన సేవలు

- కావలి మున్సిపాలిటీ కమిషనర్ బి.శివారెడ్డి



కావలి: ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు నాణ్యతతో అందించడానికి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళికాత్మకంగా ముందుకెళ్తున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ సూచనలు మేరకు కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారుల నుంచి, వార్డు సచివాలయ ఉద్యోగుల వరకు క్రియాశీలకంగా పని చేసే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కావలిలోని తన కార్యాలయంలో శుక్రవారం సాక్షితో కమిషనర్ బి.శివారెడ్డి వివిధ అంశాలపై మాట్లాడారు. పేదలకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు నిర్మాణ విషయంలో అత్యంత శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన స్థలాల్లో లబ్ధిదారులు వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకోవడం వల్ల 6,776 పక్కా గృహాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో ప్రజలకు ఆధార్ అప్‌డేట్ కోసం వెంగళరావునగర్, ముసునూరు-2 వార్డు సచివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బొమ్మారెడ్డివారివీధి-1, ఇందిరానగర్, వీఆర్‌నగర్, వైకుంఠపురం-1 వార్డు సచివాలయాల్లో కూడా ఆధార్ అప్‌డేట్ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పుట్టిన పిల్లలకు కూడా వేలిముద్రలతో సంబంధం లేకుండానే ఆధార్ కార్డును జారీ చేసే ప్రక్రియ విజయవంతంగా జరుగుతుందని తెలిపారు. కావలి మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో ఖాళీలు ఉన్న 11 కార్యదర్శి పోస్టులు, 22 వలంటీర్లు భర్తీ కోసం కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు వెల్లడించారు. ఈ నెల 12న కావలికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో భాగమైన కావలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు అవసరమైన రూ.80 కోట్లు నిధులు మంజూరుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు వివరించారు. సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా పరిశీలిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కు అందిన అర్జీలకు సంబంధించి ఎప్పటికప్పుడు స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం 'స్పందన'లో ప్రజలు అందజేసే అర్జీలను పరిష్కరించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని మున్సిపల్ స్కూల్స్‌లో 'నాడు-నేడు' కింద జరుగుతున్న అభివృద్ధి పనులు చురుగ్గా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పేదలకు ఖరీదైన వైద్యం సేవలు ఉచితంగా అందే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఉన్న ప్రతి ఒక్కరినీ 'ఆయుష్మాన్ భారత్'లో భాగస్వామ్యులను చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కమిషనర్ బి.శివారెడ్డి చెప్పారు.

వలంటీర్ల సేవలు అమోఘం



వలంటీర్ల సన్మానంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామాంజనేయులు



పల్లవోలు సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉదయగిరి: గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని జెడ్పీటీసీ మోది రామాంజనేయులు అన్నారు. ఆయన శుక్రవారం ఉదయగిరి బిట్-1, బండగానిపల్లి సచివాలయాల్లో ఆయా పంచాయితీల సర్పంచ్‌లు పి.సామ్రాజ్యం, ఎల్ రమణమ్మ అధ్యక్షతన జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారుర. సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సేవా పురస్కారాలతో సన్మానిస్తున్నదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలకు అందాలనే ఉద్దేశ్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థ దేశంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మండల కో-ఆప్షన్ సభ్యుడు సుభానీ, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దానీ, ఎంపీటీసీ పెద్దమస్తాని, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, కార్యదర్శి చిన్నబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ఓబుల్‌రెడ్డి, లక్కు రవీంద్రారెడ్డి, ఎం.వెంగళరెడ్డి పాల్గొన్నారు.

పల్లవోలు వలంటీర్లకు వందనం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పల్లవోలు సచివాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పది మంది వలంటీర్లను సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బిల్లుపాటి రమాదేవి, పంచాయతీ కార్యదర్శి మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రా నారాయణ స్వామి, పాంగూరు సుధాకర్, గంగినేని తిరుపతి పాల్గొన్నారు.

క్రాఫ్ట్, డ్రాయింగ్‌పై శిక్షణ

ఆత్మకూరు: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఆత్మకూరు గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఓంకారం రాజు ఆధ్వర్యంలో శుక్రవారం క్రాఫ్ట్, చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక చిత్రం నూరు భావాలను తెలియజేస్తుందని, చిత్రలేఖనంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు. సృజనాత్మకతతో పలు కళలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చందమామ, పంచతంత్ర కథల పుస్తకాలవిద్యార్థులకు ఇచ్చి వాటిని చదివి అవగాహన చేసుకునేలా వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ అసిస్టెంట్ ఎల్.తనూజ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి వైద్యసాయం



వృద్ధుడిని వైద్యశాలకు తీసుకెళ్తున్న వైద్యసిబ్బంది, పోలీసులు

కలిగిరి: కలిగిరిలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో కదల్లేని స్థితిలో పడి ఉన్న అనాథ వృద్ధుడికి అధికారులు, గ్రామస్తుల సహకారంతో శుక్రవారం వైద్యసాయం అందింది. కొన్ని రోజులుగా గుర్తుతెలియని వృద్ధుడు కలిగిరిలో ఉన్నాడు. అతని వివరాలు చెప్పలేక పోతున్నాడు. మూడు రోజులుగా ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో తిండి, నీరు లేకుండా పడిపోయి ఉన్నాడు. స్థానిక యువకులు తినిపించడానికి ప్రయత్నించిన నిరాకరించేవాడు. వృద్ధుడి దయనీయ పరిస్థితిని గమనించి అధికారులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది వృద్ధునికి వైద్య సేవలు అందిస్తూ కోలుకోవడానికి కృషి చేస్తున్నారు. ఎస్సై ఎం.సూర్యప్రకాష్‌రెడ్డి వృద్ధుడి వివరాలు సేకరించడానికి ప్రయత్నిస్తున్నారు.

గుండె వ్యాధులపై అవగాహన తప్పనిసరి



గుండెవ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమణయ్య

ఆత్మకూరు: యాంత్రిక జీవనంతో పాటు సరైన శారీరక శ్రమలేకపోవడంతో అధికంగా గుండె జబ్బులు సంక్రమిస్తున్నాయని, ముఖ్యంగా గుండెవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు రామచంద్రారెడ్డి ఆస్పత్రి వైద్యులు ఎంవీ రమణయ్య సూచించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గుండె వ్యాధులపై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్ రమణయ్య మాట్లాడుతూ అనేక ఒత్తిళ్లతో వ్యాధులు సంక్రమిస్తున్నాయని, దీనికి తోడు క్రమశిక్షణ లోపించడంతో పాటు ఆహార నియమాల్లోనూ తేడాలు వచ్చాయన్నారు. దీంతో గుండెపై ఒత్తిడి పెరిగి పలు వ్యాధులకు దారి తీస్తున్నాయన్నారు. ఎంత బిజీ జీవితం గడుపుతున్నా శారీరక ఒత్తిళ్లతో సంక్రమించే వ్యాధులపై అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, జి లక్ష్మీపతి, ఎస్‌కే సందానీ, నాగయ్య పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

- మాజీ ఎంపీ మేకపాటికి రైతుల వినతి



మేకపాటి రాజమోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఉదయగిరి ప్రాంత రైతులు

ఉదయగిరి: ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఉదయగిరి ప్రాంత రైతులు బ్రాహ్మణపల్లిలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. క్వింటా రూ.10 వేలు చొప్పున కొనుగోలు చేసి పసుపు రైతులకు బీమా వర్తింపజేసేలా ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన రాజమోహన్‌రెడ్డి వెంటనే వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఉదయగిరిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ఒప్పించారు.

త్వరలో జామాయిల్ కటింగ్‌కు చర్యలు

- డీఎఫ్ఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న డీఎఫ్ఓ చంద్రశేఖర్

ఉదయగిరి: జిల్లాలో అటవీశాఖ, వీఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో సాగులో ఉన్న 7,686.56 హెక్టార్లలో జామాయిల్ చెట్లను త్వరలో కటింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అటవీశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక రేంజ్ కార్యాలయ ఆవరణలో పర్యావరణహిత జీవనశైలిపై వీఎస్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, అటవీ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో 67 ప్లాంటేషన్లలో 990.73 హెక్టార్లు, 716 వీఎస్ఎస్‌ల పరిధిలో 6695.83 హెక్టార్లలో జామాయిల్ సాగులో ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వం జామాయిల్ కటింగ్‌కు ఆన్‌లైన్‌లో టెండర్ ప్రక్రియ నిర్వహించగా టన్ను రూ.3,460 వనం టింబర్‌లైన్స్ టెండరును దక్కించుకుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో వీఎస్ఎస్‌లు భాగస్వామ్యం కావాలన్నారు. వీఎస్ఎస్‌లను బలోపేతం చేసుకోవాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోపోతే మానవ మనుగడకే ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. పర్యావరణహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ రాజశేఖర్‌బాబు, రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, డీఆర్వో శ్రీనివాసులు, ఫడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో పైపులైన్ల మరమ్మతుల కోసం రూ.5 లక్షల వ్యయమయ్యే 60 పనులను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని, వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా సత్వరమే వాటిని పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవిలో సురక్షిత తాగునీరు అందించేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నయోమి, జల జీవన్‌మిషన్ నిర్వాహకులు శర్మ, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాలపై విద్యార్థుల ఆసక్తి



విద్యార్థులకు చరిత్రను చెబుతున్న ఓ విద్యార్థి

చేజర్ల (సోమశిల): గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలపై విద్యార్థుల ఆసక్తితో తమ మేధస్సును పెంపొందించుకొంటున్నారు. అనంతసాగరం గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులు గణితం, తెలుగు, ఆంగ్లంపై లైబ్రేరియన్ నారాయణరావు తెలిపిన అంశాలను ఆసక్తితో ఆలకించారు. విద్యార్థులు చదువుతో పాటు, గొప్ప వ్యక్తుల చరిత్రను చదవాలన్నారు.

ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్ష చేస్తున్న ఉద్యోగులు

కావలి: ప్రభుత్వ ఉద్యోగులు కావలిలో శుక్రవారం రిలే నిరహార దీక్ష నిర్వహించారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ కంటింజెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరయ్యారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రతి నెలా 1వ తేదీ జీత భత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 1993 నవంబరు 25 కంటే ముందు నియమితులైన ఎన్ఎంఆర్ డైలీ వేజెస్ కంటింజెంట్ ఉద్యోగులందరినీ తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వై రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఒ. సుజాతబాయ్, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి.వెంకటరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి ఎమ్మెల్యే సొంత నిధుల అందజేత



సింగనపల్లి తాగునీటి సమస్య పరిష్కారానికి సొంత నిధులు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని సింగనపల్లిలో వాటర్ ప్లాంట్ పునరుద్ధరణకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన సొంత నిధులు రూ.50 వేలు శుక్రవారం అందజేశారు. ఇటీవల సింగనపల్లిలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు బ్రాహ్మణపల్లిలో తన నివాసంలో గ్రామస్తులను పిలిపించి చెక్కును అందజేశారు. మర్రిపాడు మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధం రెడ్డి మోహన్‌రెడ్డి కూడా మరో రూ.10 వేలు తాగునీటి సమస్య పరిష్కారానికి వినియోగించాలని కోరుతూ సింగనపల్లి గ్రామస్తులకు అందించారు. తమ గ్రామ తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వరం స్పందించి సొంత నిధులు అందజేసిన ఎమ్మెల్యేకు సింగనపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపవరం కాంతారెడ్డి, చెన్ను శ్రీధర్‌రెడ్డి, కాశిరెడ్డి, నూకంరెడ్డి త్రిలోక్‌నాథ్‌రెడ్డి, ఖాజారంతుల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు



సోమశిల రోడ్డు సెంటర్‌లో ఆక్రమణలు తొలిగించిన తర్వాత విశాలంగా ఉన్న రహదారి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆ మార్గంలో కొంత దూరం వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్న విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వర రావు, టీపీఓ, ఏఈతో కలిసి శుక్రవారం జేసీబీ యంత్ర సాయంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాదారులు, వ్యాపార బోర్డులు, పలు వస్తువులు పెట్టి ఉండడంతో వాటిని తీయించేలా చేశారు. అనంతరం జేసీబీతో మట్టి కుప్పలు తొలగించి ఇరువైపులా రోడ్డు విశాలంగా ఉండేలా చేసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. పలు ట్యాక్సీలు, గూడ్స్ వాహనాలను క్రమపద్ధతిలో పెట్టేలా వారితో మాట్లాడి ఏర్పాటు చేయించారు. దీంతో ఆ మార్గంలో వాహనాలు సులభంగా ప్రయాణం చేసేలా వీలు కలిగింది.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ ఫణికుమార్

అల్లూరు: స్థానిక రామకృష్ణా జూనియర్ కళాశాల సమీపంలో మెయిన్ రోడ్డులో దెబ్బతిన్న తాగునీటి మెయిన్ పైప్‌లైన్‌కు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుఉలను చేపట్టారు. రెండు రోజుల ముందు తాగునీటి మెయిన్ పైప్‌లైన్ దెబ్బతినడంతో రెండు రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అవసరమైన సామగ్రిని తెప్పించి మరమ్మతులను పూర్తి చేశారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు తమ సిబ్బంది ఎంతో కష్టపడ్డారన్నారు. శనివారం నుంచి యథావిధిగా తాగునీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీలం సాయికుమార్, ఏఈ వినోద్, సిబ్బంది యాసిన్, పెంచిలయ్య పాల్గొన్నారు.

డ్రైడే విధిగా పాటించాలి



గర్భిణులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్

అల్లూరు: ఫ్రైడేను డ్రైడేగా పాటించే విధంగా నగర పంచాయతీ ప్రజలు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ అన్నారు. స్థానిక చెర్లోసంఘం కాలనీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి అక్కడ బ్లీచింగ్, పొడిసున్నం చల్లించి పరిశుభ్రం చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాని స్థానికులకు అవగాహన కల్పించారు. అయోడిన్ కూడిన ఉప్పును వాడడం వల్ల థైరాయిడ్, గొంతువాపు వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వృద్ధులకు, పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా ఐరన్ టాబ్లెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రమీలా, రమమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

చేజర్ల: 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందిస్తున్నామని చేజర్ల మండల వ్యవసాయ అధికారి శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ, జనుము, పిల్లిపెసర కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. డబ్బులు కట్టిన వారికి వెంటనే ఆర్‌బీకేల వద్దనే పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీడ్	కేజీ ధర	సబ్సిడీ
జీలుగ	రూ.79	రూ.39.50
జనుము	రూ.84	రూ.42.00
పిల్లిపెసర	రూ.97	రూ.48.50

మహిళా పాడిరైతులకు శిక్షణ

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నెలోని మహిళా పాడి రైతులకు సేవ్ ది చిల్డ్రన్స్, నోకియా సంస్థల ఆధ్వర్యంలో పాడి పరిశ్రమలో మెళకువలపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యులు డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్కువ ఖర్చులో సమీకృత దాణా తయారు చేసుకునే పద్ధతులు, పచ్చిమేత ప్రాముఖ్యత, అధిక పాల దిగుబడి, అధిక వెన్న శాతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చూడు గేదెల పోషణ, దూడల సంరక్షణ, పశువులు, దూడల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశుబీమా పథకం గురించి వివరించారు. విజేత డెయిరీ మేనేజర్ ఆనందరెడ్డి మాట్లాడుతూ అధిక వెన్న శాతం, పాల దిగుబడి పెంచుకోవడానికి పాటించాల్సిన మెళకువలను వివరించారు. కార్యక్రమంలో సేవ్ ది చిల్డ్రన్స్ సంస్థ నెల్లూరు సూపర్‌వైజర్ ఎంవీ రమణయ్య, సర్పంచ్ గోవిందస్వామి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.